క్లుప్తంగా

వేడుకగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

విశాఖ విద్య: ఎస్‌పీడీ సెంటర్ దరి గవరవీధిలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం వేడుకగా సాగుతోంది. ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన అమ్మవారి మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం గౌరీమాత వద్ద మణిద్వీపం ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. గౌరీమాతను స్మరిస్తూ సామూహిక కీర్తనలు ఆలపించారు.

ఎన్‌ఏడీ బస్టాప్ వద్ద నిలిచిన లారీ



బస్టాప్ ముందు నిలిచిన లారీ

విశాఖ విద్య: ఎన్‌ఏడీ బస్టాప్‌లో వద్ద సాంకేతిక సమస్యతో ఓ లారీ నిలిచిపోయింది. ఇంజిన్ మరమ్మతులకు గురికావడంతో వాహనం అక్కడ నుంచి కదలేని పరిస్థితి ఏర్పడింది. ప్రయాణికులు వేచి ఉండే బస్టాప్ ముందే సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు నిలిచిపోయింది. దీంతో ఆర్టీసీ బస్సులు ముందుకు వచ్చి నిలపడంతో ప్రయాణికులు వర్షంలో తడుచుకుంటూనే బస్సులు ఎక్కారు. మధ్యాహ్నం తర్వాత మరమ్మతులు పూర్తి చేసి లారీని అక్కడ నుంచి తొలగించారు.

జోన్-5లో షాపులకు 22న బహిరంగ వేలం

కంచరపాలెం: జీవీఎంసీ జ్ఞానాపురం జోన్-5 పరిధిలోని 40వ వార్డు నుంచి 63వ వార్డు వరకు గల 24 వార్డులకు సంబంధించిన ఖాళీగా ఉన్న దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు పక్కన మార్కెట్లకు ఈ నెల 22న శుక్రవారం ఉదయం 10 గంటలకు జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో 8, 15, 41, 46, 48, 52, 55, 56, 57, 58 నంబర్ల దుకాణాలు, సుబ్బలక్ష్మి నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 3, 9, 13, 14 నంబర్ల షాపులు, సంజీవయ్య కాలనీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1, 2 షాపులు, ములగాడ షాపింగ్ కాంప్లెక్స్‌లో 2, 4, అశోక్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1, 2 నంబర్ల షాపులకు మూడేళ్ల కాల పరిమితి, జీవీఎంసీ 51వ వార్డు మాధవస్వామి కల్యాణ మండపానికి మూడు సంవత్సరాలు, జనతా కాలనీ, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం రోడ్ పక్కన మార్కెట్లకు ఒక సంవత్సరం కాల పరిమితితో వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లోని బుచ్చిరాజుపాలెం, అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డి. వెంకటేశ్వరి మంగళవారం తనిఖీ చేశారు. కేంద్రాలకు సరఫరా అయిన సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల ప్రకారం స్టాక్ ఉన్నాయా లేదా అని పరిశీలించారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, నమోదైన వారందరికీ పౌష్టికాహారం అందించేలా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆమె వెంట అర్బన్ సీడీపీవో కుమారి, మర్రిపాలెం సెక్టార్ సూపర్ వైజర్ వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

సరికొత్తగా.. రైతుబజార్

నాడు

గతంలో మర్రిపాలెం రైతుబజార్ ఎలాంటి వసతులు లేకుండా ఉండేది. చిన్నపాటి వర్షానికి కూడా మార్కెట్లోని రైతులు ఇబ్బంది పడేవారు. వినియోగదారులు బజారు లోపలికి వచ్చేందుకు వీలు లేకుండా అంతా బురదమయంగా ఉండేది. రైతులకు కూడా సరైన సౌకర్యాలు ఉండేవి కాదు. ఈ విషయంలో రైతులు పలుమార్లు విన్నవించినా సరైన స్పందన ఉండేది కాదు.

నేడు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మర్రిపాలెం రైతుబజారులో ఎన్నో సౌకర్యాలు కల్పించింది. వర్షాకాలంలో రైతుల స్టాళ్లు కారిపోకుండా దుకాణాలపై రేకులు ఏర్పాటు చేశారు. రైతుబజారు సిబ్బందికి కూడా వసతులు కల్పించారు. అంతే కాకుండా కొనుగోలుదారులు పెరుగున్న దృష్ట్యా రైతు బజారు విస్తరణకు కూడా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భారీగా నిధులు వెచ్చిస్తూ రైతుబజారును ఆధునికీకరిస్తున్నారు.

రాష్ట్రంలో మెరుగైన పాలనతో సంక్షేమానికి కృషి చేస్తోన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాలను ఇతోధికంగా అభివృద్ధి చేస్తున్నారు. పేదలకు మేలు చేసే ఏ అంశాన్ని విస్మరించకుండా ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపయుక్తంగా ఉండే రైతుబజార్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారు. దీంతో గతంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని రైతుబజార్లు ఇప్పుడు నూతన హంగులతో ప్రజలకు సేవలందిస్తున్నాయి.



రైతుబజార్‌లో నూతనంగా వేసిన రేకులు



ఇది కదా అభివృద్ధి

- మర్రిపాలెంలో వ్యాపారులకు మరిన్ని సౌకర్యాలు
- దుకాణాలపై రేకుల ఏర్పాటు
- కొత్తగా ఫెన్సింగ్ నిర్మాణం



రైతుబజార్‌లో కొనుగోళ్ల సందడి



స్థలం పరిరక్షణకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

మర్రిపాలెం రైతుబజార్ స్వరూపం ఇదీ..

- రూ.7 లక్షలతో మర్రిపాలెం రైతు బజారు ఆధునికీకరణ
- ప్రతిరోజూ 2 వేల మందికి పైగా కొనుగోలుదారుల రాక
- ప్రస్తుతం వ్యాపారం చేస్తున్న రైతుల సంఖ్య 60
- మరో 40 దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- నెలకు వచ్చే ఆదాయం సుమారు 1.20 లక్షలు

విశాఖ విద్య : మర్రిపాలెం రైతు బజారు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. నగర ప్రజానీకానికి బయటి మార్కెట్ కంటే తక్కువ ధరకే అన్ని రకాల కూరగాయలు, నిత్యావసర సరకులు లభ్యమయ్యేలా నిర్వహిస్తోన్న రైతు బజార్లలో తగిన సౌకర్యాలు కల్పించటంలో టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. వినియోగదారుల సేవలో రైతుబజార్ల పాత్ర కీలకంగా ఉన్నందున వీటి అభివృద్ధిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ.7 లక్షలతో మర్రిపాలెం రైతుబజారులో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. దుకాణాలపై కొత్తగా రేకులు వేశారు. ఖాళీ స్థలం పరిరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో దుకాణాల ముందు ఫ్లోరింగ్ చేశారు.

రైతుబజారుకు విశేష ఆదరణ..

మర్రిపాలెం రైతుబజారుకు వచ్చే కొనుగోలుదారుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న దీనికి శాంతినగర్, అంబేడ్కర్ నగర్, వుడా లే అవుట్, ఎన్‌ఏడీ సెంటర్, మర్రిపాలెం, మాధవదార, మురళీనగర్ వంటి ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 2 వేల మందికి పైగా కొనుగోలుదారులు వస్తుంటారు. దీంతో నెలకు రూ.1.20 లక్షల వరకు ఆదాయం వస్తోంది. రైతు బజారు ఎస్టేట్ అధికారి, అటెండర్, స్కావెంజర్ల వేతనాలు, ఇతర నిర్వహణ ఖర్చులు పోను ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం సమకూరేది కాదు. కానీ నగర వాసులకు తక్కువ ధరకే కూరగాయలు, నిత్యావసర సరకులను అందించాలనే ఏకైక లక్ష్యంతోనే వీటిని నిర్వహిస్తున్నారు.

మరో 40 దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదన..

రైతుబజారులో ప్రస్తుతం 94 మంది రైతులు తమ పేర్లు నమోదు చేసుకోగా, వీరిలో 60 మంది దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. వీరు కాకుండా డ్వాక్రా గ్రూపు మహిళలు, డీసీఎంఎస్, విశాఖ డెయిరీ ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేసి, బయటి మార్కెట్ కంటే తక్కువ ధరకే నిత్యావసర సరకులు విక్రయిస్తున్నారు. రైతు బజారుకు వచ్చే కొనుగోలుదారులు పెరుగుతున్నందున మరో 40 దుకాణాలు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు చేశారు.

సౌకర్యాలు మెరుగుపడ్డాయి



రైతుబజారులో సౌకర్యాలు బాగా మెరుగుపడ్డాయి. గతంలో అయితే వర్షం కురిస్తే దుకాణాల నిర్వహణకు కొంత అసౌకర్యంగా ఉండేది. కానీ ఇప్పుడు కొత్తగా రేకులు వేయటం వల్ల ఆ సమస్య తొలగింది. మా పొలం, బంధువుల పొలంలో పండే కూరగాయలను ఇక్కడికి తీసుకొచ్చి విక్రయిస్తాను. రోజు రూ.6 వేల వరకు అమ్ముడవుతాయి. నాకు రూ.7 నుంచి 8 వందల వరకు మిగులుతోంది.

– షిణగం రమణ, రైతు, ఆనందపురం మండలం గిడిజాల

టీడీపీ ప్రభుత్వంలో ఏమాత్రం పట్టించుకోలేదు



మర్రిపాలెం రైతు బజారు నిర్వహణతో రైతులకు భరోసా చిక్కడంతో పాటు కొనుగోలుదారులకు తక్కువ ధరకే కూరగాయలు అందుతున్నాయి. అయితే టీడీపీ ప్రభుత్వ హయాంలో సౌకర్యాల కల్పనపై ఏమాత్రం దృష్టి సారించలేదు. ధరల దోపిడీ నుంచి నగరవాసులకు అండగా నిలవాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుబజారును అభివృద్ధి చేయటం హర్షణీయం.

– బీఎస్ కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

అందరికీ ఉపయోగకరంగా..



రైతు బజారు నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తెరిచి ఉంటుంది. ప్రతి బుధవారం సెలవు. జిల్లా అధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ఏ రోజుకారోజు కూరగాయల ధరలను నిర్ణయించి, అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మేలు చేసేలా దృష్టి సారిస్తున్నాం. చాలా కాలం తర్వాత రైతు బజారు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

– కొమ్మనాపల్లి వరహాలు, ఎస్టేట్ అధికారి, మర్రిపాలెం రైతు బజారు

ఈవీఎంలపై అవగాహన కల్పిస్తాం

విశాఖ విద్య: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంల వినియోగంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తామని పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, విశాఖ పట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అన్నారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అన్ని మండలాల అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియపై బీఎల్‌వోలంతా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అర్హులైన వారందరికీ తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించేలా ప్రజానీకంలో చైతన్యం కల్పించాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో ఒకే వ్యక్తి దరఖాస్తులు సమర్పిస్తే, వాటిని ఎట్టి పరిస్థితుల్లో పరిగణలోకి తీసుకోవద్దని స్పష్టం చేశారు. ఓటర్ల తొలగింపులో కూడా పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ఓటర్లు అందరికీ ఈవీఎంల వినియోగంపై అవగాహన కలిగించేలా అన్ని పోలింగ్ స్టేషన్లలో సదస్సులు నిర్వహించాలన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల వారు సహకరించాలన్నారు. సమావేశంలో 8వ జోన్ కమిషనర్ ఎం. మల్లయ్య నాయుడు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

వైభవుని సన్నిధిలో రేపటి నుంచి పవిత్రోత్సవాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక బహుళ ద్వాదశి శనివారం వరకు శ్రీవారి సన్నిధిలో త్రయాహ్నిక దీక్షతో పాంచరాత్ర దివ్య ఆగమ విధానంలో ఉత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బహుళ ఏకాదశి శుక్రవారం సామూహికంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం చేస్తామన్నారు. 7న ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, బాలభోగం, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహిస్తామని తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మంగళాశాసనం, సాయంత్రం విశేష హోమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

దుర్గాలమ్మ, బంగారమ్మకు ప్రత్యేక పూజలు



దుర్గాలమ్మకు పూజలు చేస్తున్న అర్చకుడు, పారాయణం పఠిస్తున్న భక్తులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90 వార్డు బుచ్చిరాజుపాలెంలోని దుర్గాలమ్మ- బంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని అమ్మవారికి మూర్తులకు కుంకుమ పూజ చేశారు. భక్తుల జేజేల నడుమ అమ్మవారికి నక్షత్ర హారతులు ఇచ్చారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహిళలు సామూహిక పారాయణంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం అందించారు.

ముద్దయిన పశ్చిమ

- జనజీవనం అస్తవ్యస్తం
- దినసరి కార్యకలాపాలకు అంతరాయం



విశాఖ విమానాశ్రయం పాత టెర్మినల్ వద్ద చేరిన నీరు

గోపాలపట్నం: జోరు వానతో పశ్చిమ ప్రాంతంలోని గోపాలపట్నం పరిసర ప్రాంతాలు తడిసి ముద్దయ్యాయి. మిచాంగ్ తుపాను కారణంగా ఎన్‌ఏడీ, గోపాలపట్నం, ఎయిర్ పోర్టు, కొత్తపాలెం ప్రాంతాల్లో ఉదయం నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కాలువులు, గెడ్డల్లో వర్షపునీరు పొంగి ప్రవహించింది. పారిశుద్ధ్య కార్మికులు గెడ్డల్లో పూడికలు తొలగించి వెంటవెంటనే తరలించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టారు.



గోపాలపట్నం బంక్ జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

విమానాశ్రయం పాత టెర్మినల్ వద్ద చేరిన నీరు

విశాఖ విమానాశ్రయం పాత టెర్మినల్ వద్ద వర్షపు నీరు నిలిచి పోయింది. ఈ టెర్మినల్‌లో ఎయిర్ కార్గో నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడి కార్గోలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ప్రాంతంలో పార్కింగ్ ఏరియా, టెర్మినల్ ప్రాంతంలో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచిపోవడం పరిపాటే. దీని వల్ల విమానాల రాకపోకలకు రన్‌వేకు ఇబ్బందులు తలెత్తవని అధికారులు చెబుతున్నారు.



గోపాలపట్నం శ్రీరామ్‌నగర్‌లో చెట్టుకొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

జోరువాన

విశాఖ విద్య: తుపాను ప్రభావంతో మంగళవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో ప్రజానీకం రోజువారీ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే రీతిన వర్షం కురవడంతో అంతా ఇళ్లకే పరిమితమయ్యారు. రోజువారీ విధులకు హాజరయ్యే ఉద్యోగులు గొడుగుల సాయంతో వర్షంలోనే వాహనాలపై ప్రయాణాలు సాగించారు. నిత్యం జనంతో సందడిగా కనిపించే ఎన్‌ఏడీ సెంటర్ జోరువానతో బోసిపోయినట్లు కనిపించింది. భారీ వర్షాలతో ఎన్‌ఏడీ సెంటర్ ఫ్లై ఓవర్ కింద, గోపాలపట్నం రహదారుల్లో నిలిచిన నీటిని నగర పాలక సంస్థ సిబ్బంది కిందకు పంపేలా చర్యలు తీసుకున్నారు.



ఫ్లై ఓవర్ వద్ద వర్షపు నీటిలో ఆగిపోయిన ద్విచక్రవాహనం





ఫ్లై ఓవర్ ఫుట్‌వే బ్రిడ్జిపై గొడుగుల సాయంతో వెళ్తున్న మహిళలు

పారిశుధ్య నిర్వహణపై ఫోకస్

వర్షాల నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు పారిశుధ్య నిర్వహణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. జోన్ 5,8 జోనల్ కమిషనర్లు కృష్ణ, ఎం.మల్లయ్య నాయుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీల్లో వర్షపునీరు నిల్వ లేకుండా కిందకు పోయేలా చర్యలు చేపట్టారు.

యంత్రాంగం అప్రమత్తం

సింథియా: తుపాను నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు అప్రమత్తమయ్యారు. వర్షాల వల్ల నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో పర్యటించి నిర్వహణ పనులు చేపట్టారు.

జీవీఎంసీ 58వ వార్డులో ములగాడ ప్రాంతంలోని ప్రధాన గెడ్డ పొంగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ గులివిందల లావణ్య దృష్టికి మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ప్రధాన గెడ్డకు అడ్డంగా ఉన్న పైప్‌లను తొలగించే చర్యలు చేపట్టారు. మురుగు నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకున్న విధానంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గులివిందల కృష్ణ, ములగాడ సచివాలయ కన్వీనర్ వేణుగోపాల్‌రెడ్డి, ఓడూరి లక్ష్మి, పెద్దాడ అప్పలరాజు, నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రినాథ్, పైడి రాజు, రమేష్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.



58వ వార్డులో ప్రధాన గెడ్డను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య, ఇతర అధికారులు

సీఎం సహాయ నిధి కోరుతూ వినతి

సింథియా : జీవీఎంసీ 60వ వార్డు పరిధి అశోక్ నగర్‌లో నివాసముంటున్న మర్రిపు శ్రీనివాసరావు అనారోగ్యం దృష్ట్యా సీఎం సహాయ నిధి కోరుతూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి శరగడం పత్నీరావు నేతృత్వంలో పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత కొంత కాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ నగరంలోని విజేత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానని తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు శస్త్రచికిత్స జరిగిందని, సుమారు రూ. 4 లక్షలు ఖర్చు అయిందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నానని ఆడారి అనంద్‌కుమార్‌కు తెలిపారు. దీనిపై స్పందించిన ఆనంద్‌కుమార్ ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి సాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఆడారి ఆనంద్‌కుమార్‌కు సమస్యను వివరిస్తున్న బాధితుడు

షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల ఓ ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక జ్యోతి ప్లాజాలో మర్రిపాలెం ఉడాలే అవుట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వాసుదేవరావు నివాసముంటున్నారు. ఇటీవల వాసుదేవరావు దంపతులు ఆస్ట్రేలియాలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి మంటలు, పొగ రావడంతో అపార్ట్‌మెంట్ వాసులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే మర్రిపాలెం ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు దగ్ధమయాయి. ఈ అగ్ని ప్రమాదం వల్ల సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఫైర్ అధికారులు ఆరా తీస్తున్నారు.



కాలి బూడిదయిన ఏసీ